క్లుప్తంగా

ఘనంగా జనార్ధనమూర్తి జన్మదిన వేడుకలు

తాడేపల్లి రూరల్: సోనోవిజన్ అధినేత పొట్లూరి జనార్ధనమూర్తి 89వ జన్మదిన వేడుకలను ఆదివారం అమరావతి కరకట్ట వెంబడి ఉన్న ఆక్వా డెవిల్స్ ప్రాంగణంలో ఘనంగా నిర్వహించారు. ఆక్వా డెవిల్స్ వ్యవస్థాపకులు, మాజీ ఎంపీ గోకరాజు గంగరాజు మాట్లాడుతూ వ్యాపార రంగంలో రాణించిన జనార్ధనమూర్తి అనేక సామాజిక కార్యక్రమాలను కూడా నిర్వహిస్తున్నారని పేర్కొన్నారు. ఆయన జీవిత ప్రస్థానంలో వ్యాపారవేత్తగా సాధించిన విజయాలు, సమాజ శ్రేయస్సు కోసం చూపి దాతృత్వం ఎందరికో స్ఫూర్తిదాయకమని ఆయన ఇలాంటి పుట్టిన రోజులు మరెన్నో జరుపుకోవాలని ఆకాంక్షించారు. పలువురు ప్రముఖులు జనార్ధనమూర్తి దంపతులను అభినందించారు. కార్యక్రమంలో ఆకుల శ్రీనివాసకుమార్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థుల సమస్యలపై నిరంతర పోరాటం

లక్ష్మీపురం: విద్యార్థుల సమస్యలపై నిరంతరం పోరాడుతూ, విద్యను సామాజిక మార్పుకు ఆయుధంగా మలచడంలో ఎస్ఎఫ్ఐ కీలక పాత్ర పోషిస్తోందని మాజీ ఎమ్మెల్సీ కేఎస్ లక్ష్మణరావు అన్నారు. ఎస్ఎఫ్ఐ జిల్లా ప్లీనరీ సమావేశాలు ఆదివారం ప్రారంభమయ్యాయి. లక్ష్మణరావు మాట్లాడుతూ ప్రభుత్వ విద్యారంగాన్ని బలోపేతం చేయడంతోపాటు పేద, మధ్యతరగతి విద్యార్థులకు నాణ్యమైన విద్య అందేలా ప్రభుత్వాలు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. విద్యార్థుల హక్కుల కోసం ప్రశ్నించే గొంతుకలను బలోపేతం చేయాలని, విద్యార్థి ఉద్యమాన్ని మరింత విస్తృతంగా ముందుకు తీసుకెళ్లాలని పిలుపునిచ్చారు. విద్యార్థులు చదువుతోపాటు సమాజంలో జరుగుతున్న పరిణామాలపై అవగాహన పెంచుకోవాలని సూచించారు. ఎస్ఎఫ్ఐ రాష్ట్ర కార్యదర్శి కే ప్రసన్నకుమార్ మాట్లాడుతూ రాష్ట్రంలో విద్యారంగం అనేక సమస్యలను ఎదుర్కొంటోందని అన్నారు. ప్రభుత్వ విద్యాసంస్థల్లో మౌలిక వసతులు, హాస్టల్ సౌకర్యాలు, మెస్ చార్జీలు, స్కాలర్‌షిప్‌లు, ఫీజు రీయింబర్స్‌మెంట్ తదితర సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఎస్ఎఫ్ఐ జిల్లా మాజీ కార్యదర్శి ఎన్.భావనారాయణ మాట్లాడారు.

జిల్లా కన్వీనర్‌గా షేక్ సమీర్ ఎన్నిక

ప్లీనరీ సమావేశాల్లో ఎస్ఎఫ్ఐ గుంటూరు జిల్లా కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. జిల్లా కన్వీనర్‌గా షేక్ సమీర్ ఎన్నికయ్యారు. జిల్లా కమిటీ సభ్యులుగా రాజ్‌కుమార్, దాసరి కిరణ్, డి.పీ.నాయక్, జాషువా, మరియమ్మ, కిన్నెర, యశ్వంత్, సూర్జిత్, ఉమామహేశ్వరరావు, ధీరజ్, జాన్ రాజ్ గణేష్, వినయ్, హనీఫ్, రూబెన్, ఇషాంత్‌రెడ్డి ఎన్నికయ్యారు.

చిత్రకళా వీధితో కళాకారులకు ప్రయోజనం శూన్యం

- రహదారులను మూసేసి రోడ్లపై స్టాళ్లు అవసరమా!
- ప్రత్యామ్నాయ వేదికలు ఉన్నా ప్రధాన రహదారులే ఎందుకని: వైఎస్సార్ సీపీ మహిళా విభాగం నేతలు నిలదీత

మీడియాతో మాట్లాడుతున్న మహిళా నాయకులు వరలక్ష్మీదేవి, తులసి, శశికళ, రాజలత

గుంటూరు ఎడ్యుకేషన్: అమరావతి చిత్రకళా వీధి పేరుతో రోడ్లనే మూసేసి కార్యక్రమాలను నిర్వహించడం వలన కూటమి ప్రభుత్వానికి ప్రచార ఆర్భాటం మినహా, ప్రజలకు, కళాకారులకు ఎటువంటి ప్రయోజనం లేదని వైఎస్సార్ సీపీ గుంటూరు జిల్లా మహిళా విభాగ ప్రధాన కార్యదర్శి రఘుమహంతి వరలక్ష్మీదేవి, గుంటూరు పశ్చిమ నియోజకవర్గ అధ్యక్షురాలు సిద్ద వెంకాయమ్మ అన్నారు. ఆదివారం బృందావన్‌గార్డెన్స్‌లోని వైఎస్సార్ సీపీ జిల్లా కార్యాలయంలో మీడియా సమవేశం నిర్వహించారు. మాజీ కార్పొరేటర్ బూసి రాజులత, జిల్లా మహిళా విభాగ నాయకులు సూదా తులసి కుమారి, ఇంటూరి శశికళ, వజ్రాల విజయ, మలిరెడ్డి కల్పన రెడ్డితో కలసి వారు మాట్లాడుతూ చిత్రకళా వీధి కార్యక్రమానికి వైఎస్సార్ సీపీ వ్యతిరేకం కాదని, కళలు, సాంస్కృతిక కార్యక్రమాలను స్వాగతిస్తున్నామని తెలిపారు. అయితే ప్రజలకు అసౌకర్యం కలగకుండా కార్యక్రమాలు నిర్వహించేందుకు ప్రత్యామ్నాయ వేదికలు అందుబాటులో ఉన్నప్పటికీ ప్రధాన రహదారులను ఎంచుకోవడంపై ప్రజలు ప్రశ్నిస్తున్నారని అన్నారు. నగరంలో ఎన్టీఆర్ స్టేడియం, బీఆర్ స్టేడియం, చేబ్రోలు హనుమయ్య కంపెనీ, గుంటూరు గ్రౌండ్ వంటి ప్రజాదరణ పొందిన, కార్యక్రమాలకు అనుకూలమైన ప్రదేశాలు అందుబాటులో ఉన్నప్పటికీ రహదారులనే కార్యక్రమం కోసం ఎంచుకోవడంలో ప్రజా ప్రయోజనం ఏమిటని ప్రశ్నించారు? శంకర్‌విలాస్ బ్రిడ్జి నిర్మాణ పనుల కారణంగా నగర ప్రజలు విపరీతమైన ట్రాఫిక్ కష్టాలు ఎదుర్కొంటున్న పరిస్థితుల్లో ప్రధాన రహదారులను మూసివేయడం వలన ట్రాఫిక్ సమస్య మరింత పెరిగిందని అన్నారు. దాదాపు రెండు కిలోమీటర్ల మేరకు ప్రధాన రహదారిని మూసి వేసి, స్టాళ్లను, వేదికలను ఏర్పాటు చేయడంతో పాటు గుజ్జనగుండ్ల నుంచి కొరిటెపాడు వరకు ప్రధాన రహదారిలోకి వచ్చే మిగిలిన రోడ్లను మూసి వేయడం వలన ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడ్డారని చెప్పారు. ప్రధాన రహదారిపై కార్యక్రమాన్ని నిర్వహించడంతో ఆ మార్గంపై ఆధారపడి చిన్న, చిన్న వ్యాపారాలు చేసుకుని జీవనాన్ని గడుపుతున్న చిరు వ్యాపారస్తులు తీవ్రంగా నష్టపోయారని, దుకాణాలు, తాత్కాలిక స్టాల్స్ ఏర్పాటు చేసుకుని రోజువారీ ఆదాయంపై ఆధారపడే వారు రహదారి మూసివేతతో తమ జీవన విధానాన్ని కోల్పోయి ఇబ్బందులకు గురవుతున్నారని చెప్పారు. ప్రత్యామ్నాయ వేదికలు సౌకర్యవంతంగా ఉన్నప్పటికీ ప్రధాన రహదారులను ఎంచుకోవాల్సిన అవసరం ఏమిటో అధికారులు ప్రజలకు స్పష్టంచేయాలని డిమాండ్ చేశారు. ప్రజలకు ఇబ్బంది కలగకుండా కార్యక్రమాలను నిర్వహించి, ప్రజా ప్రయోజనాలకు ప్రాధాన్యత ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు.

ప్రతి ఇంటిపై జాతీయ జెండా ఎగురవేయాలి

కేంద్ర మంత్రి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్

ర్యాలీలో పాల్గొన్న కూటమి నేతలు, కార్యకర్తలు

గుంటూరు మెడికల్ ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పిలుపు మేరకు నిర్వహిస్తున్న 'హర్ ఘర్ తిరంగా' కార్యక్రమంలో భాగంగా ఆదివారం గుంటూరులో బీజేపీ జిల్లా అధ్యక్షుడు చెరుకూరి తిరుపతిరావు ఆధ్వర్యంలో జాతీయ జెండాలతో ర్యాలీ నిర్వహించారు. ఈ యాత్ర 200 మీటర్ల జాతీయ జెండాతో మార్కెట్ సెంటర్ వెంకటేశ్వర విజ్ఞాన్ మందిరం నుంచి మార్కెట్ సెంటర్ మీదగా లిబర్టీ, కృష్ణమహల్ థియేటర్ రోడ్డులో నుంచి నాజ్ సెంటర్ వరకు ప్రదర్శన సాగింది. ర్యాలీకి ముఖ్యఅతిథిగా విచ్చేసిన కేంద్ర మంత్రి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్ మాట్లాడుతూ జాతీయ జెండా ప్రతి భారతీయుడి ఆత్మగౌరవానికి, దేశభక్తికి, ఐక్యతకు ప్రతీక అని అన్నారు. రాజ్యసభ సభ్యుడు భాష్యం రామకృష్ణ మాట్లాడుతూ జాతీయ జెండా కోసం లక్షలాది మంది స్వాతంత్ర్య సమరయోధులు తమ ప్రాణాలను అర్పించారు. ప్రతి భారతీయుడి ఇంటిపై జెండా ఎగరాల కోరారు. తూర్పు ఎమ్మెల్యే నసీర్ మహమ్మద్ మాట్లాడుతూ యువత చేతిలో జాతీయ పతాకం ఉంటే దేశ భవిష్యత్ భద్రంగా ఉంటుందన్నారు. పశ్చిమ ఎమ్మెల్యే గళ్లా మాధవి మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ తమ బాధ్యతను నిజాయితీగా నిర్వర్తించినప్పుడే నిజమైన దేశభక్తి నిరూపితమవుతుందన్నారు. ర్యాలీలో ఇండస్ట్రియల్ కార్పొరేషన్ చైర్మన్ డేగల ప్రభాకర్, జనసేన జిల్లా అధ్యక్షుడు గాదె వెంకటేశ్వరరావు, మాజీ డెప్యూటీ మేయర్ షేక్ సజీల, తిరంగా ర్యాలీ రాష్ట్ర కన్వీనర్ గుడిసె దేవానంద్, కో- కన్వీనర్లు శివారెడ్డి, సాయి లోకేష్, ఈదర శ్రీనివాస రెడ్డి, వెలగలేటి గంగాధర్, పాలపాటి రవికుమార్, డాక్టర్ టి.వి.రావు, తిరంగా యాత్ర జిల్లా కన్వీనర్ డాక్టర్ చరక కుమార్‌గౌడ్, కో- కన్వీనర్లు క్రిష్టిపాటి నారాయణరెడ్డి, మేడూరి యశ్వంత్, నడ్డి నాగమల్లేశ్వరి, భజరంగ్ రామకృష్ణ, కంతేటి బ్రహ్మయ్య, కూటమి నాయకులు, కార్యకర్తలు, యువత, మహిళలు, విద్యార్థులు, ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

అంబేడ్కర్ సిద్ధాంతాలను ప్రజల్లోకి తీసుకువెళ్లాలి

మంగళగిరి టౌన్: భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ సిద్ధాంతాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకువెళ్లేందుకు కృషి చేయాలని భీమ్ ఆర్మీ రాష్ట్ర అధ్యక్షులు మణిపాటి మురళి పిలుపునిచ్చారు. మంగళగిరి పట్టణంలోని రత్నాల చెరువు వద్ద ఆదివారం భీమ్ ఆర్మీ రాష్ట్ర కార్యాలయాన్ని ఆయన ప్రారంభించారు. కార్యక్రమంలో కర్నూలు, అనకాపల్లి, బాపట్ల, నెల్లూరు, తిరుపతి, చిత్తూరు, నంద్యాల, అనంతపురం జిల్లాల కమిటీలను ప్రకటించారు. రాష్ట్రంలోని 28 జిల్లాల్లో కమిటీలు ఏర్పాటు చేసిన అనంతరం విజయవాడలో రాష్ట్రస్థాయి సభ నిర్వహించనున్నామని, ఆ సభకు భీమ్ ఆర్మీ జాతీయ అధ్యక్షులు వినయ్‌రతన్‌సింగ్‌ను ఆహ్వానించనున్నట్లు తెలిపారు. నూతనంగా బాధ్యతలు స్వీకరించిన నాయకులు సంస్థ ఆశయాలను ప్రజల్లోకి తీసుకు వెళ్లాలని సూచించారు. తొలుత మహనీయుల చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో పాదర్తి అంబేద్కర్ బుద్ధ విహార్ వ్యవస్థాపకులు పాలేటి పుల్లయ్య, భీమ్ ఆర్మీ రాష్ట్ర ఉపాధ్యక్షులు గురుమూర్తి, అంబేద్కర్ అభిమానులు పాల్గొన్నారు.

బావను నమ్మి వెళ్లి.. లైంగికదాడికి గురై..

- యువతి అదృశ్యం కేసులో ట్విస్టులు
- వైద్యశాల నుంచి వెళ్లిపోవడంతో వెలుగులోకి వచ్చిన వైనం

తెనాలిరూరల్: బావను నమ్మి వెళ్లిన యువతి ఒకరితోపాటు అతని స్నేహితుడు, మరో కామాంధుడి చేతిలో లైంగికి దాడికి గురైంది. భర్త నుంచి వేరుపడిన యువతి ముగ్గురి చేతిలో మోసపోయి ప్రస్తుతం మూడు నెలల గర్భంతో ఉంది. చికిత్స కోసం వైద్యశాలలో చేరిన ఆమె వేరే దంపతులతో కలసి వెళ్లిపోవడంతో విషయం వెలుగులోకి వచ్చింది. వివరాలు.. పట్టణ చినరావూరుకు చెందిన 19 ఏళ్ల యువతికి గతేడాది వివాహం అయింది. యువతి ఆరోగ్యం సరిగా లేకపోవడం, కంటి సమస్యలు ఉండడంతో ఐదు నెలలకు భర్త నుంచి విడిపోయింది. పుట్టింటికి వచ్చి ఉంటూనే ఆమె ఏప్రిల్ 12న ఇంటి నుంచి వెళ్లిపోయింది. పనికి వెళ్లి తిరిగి వచ్చిన తల్లి, కుమార్తె కనబడకపోవడంతో చుట్టుపక్కల విచారించగా, లగేజి బ్యాగుతో కనబడినట్టు కొందరు చెప్పడంతో అదే విషయమై పోలీసులకు తల్లి ఫిర్యాదు చేసింది. వన్ టౌన్ పోలీసులు యువతి అదృశ్యం కేసు నమోదు చేశారు. కట్ చేస్తే.. ఇంటి నుంచి వెళ్లిపోయిన యువతి చిలకలూరిపేటలోని తన బావ వద్దకు చేరింది. కొన్నాళ్లు అక్కడే ఉంచి ఆమెపై లైంగిక దాడికి పాల్పడ్డాడు. అనంతరం తెనాలి మండలం కొలకలూరుకు చెందిన తన స్నేహితుడు ఉమాహేశ్వరరావుకు అప్పగించాడు. అతనూ యువతిని గ్రామంలో ఉంచి పలుమార్లు లైంగికదాడికి పాల్పడ్డాడు. మూడు నెలల గర్భిణి అని తెలుసుకుని ఆమెను వదిలించుకోవాలని దూషించడం, దాడి చేయడం ప్రారంభించాడు. ఈ క్రమంలో గర్భిణి అయిన ఆమె అస్వస్థతకు గురవగా, కడుపునకు గేటు తగిలిందంటూ తెనాలి జిల్లా వైద్యశాలలో చికిత్సకు చేర్పించాడు. మూడు రోజుల పాటు వైద్యశాలలో ఉన్న యువతికి అక్కడే చికిత్సకు వచ్చిన శ్రీకాకుళం జిల్లాకు చెందిన దుర్గ, ఆమె భర్త చిన్నారావు పరిచయమయ్యారు. ఈ దంపతులు ప్రస్తుతం నిజాంపట్నంలో రొయ్యల చెరువులకు కాపలా ఉంటున్నారు. తనకు ఎవరూ లేరని, అనాథని అని యువతి వారికి చెప్పగా, డిశ్చార్జి రాసినప్పుడు తమ వెంట తీసుకెళ్లారు. అక్కడ చిన్నారావు ఆమెపై లైంగికదాడికి పాల్పడ్డాడు. యువతి కోసం వైద్యశాలకు వచ్చిన ఉమామహేశ్వరరావుకు ఆమె ఆచూకీ లభించకపోవడంతో త్రీ టౌన్ పోలీసులను ఆశ్రయించాడు. వారు విచారించగా అప్పటికే యువతిపై వన్ టౌన్ పోలీస్‌స్టేషన్‌లో మిస్సింగ్ కేసు ఉందని తెలియడంతో వన్ టౌన్ పోలీసులకు యువతి ఆచూకీ తెలిపారు. వన్ టౌన్ పోలీసులు యువతిని తల్లిదండ్రులకు అప్పగించినట్టు తెలిసింది. యువతి అదృశ్యం కేసును ఎస్సీ, ఎస్టీ అట్రాసిటి కేసు, లైంగిక దాడి కేసుగా సెక్షన్‌లు మార్చి తదుపరి చర్యలు తీసుకోనున్నారు.

ఎల్ నినో ప్రభావంపై రైతులకు అవగాహన

రేపు లాం ఫామ్‌లో కిసాన్ మేళా వర్క్‌షాప్

కొరిటెపాడు(గుంటూరు): ఎల్ నినో వాతావరణ పరిస్థితుల ప్రభావంతో వర్షపాతం అసాధారణంగా ఉండే అవకాశం ఉన్న నేపథ్యంలో పంటలను కాపాడుకునేందుకు రైతులకు శాస్త్రీయ అవగాహన కల్పించేందుకు మంగళవారం గుంటూరులో కిసాన్ మేళా వర్క్‌షాప్ నిర్వహించనున్నారు. వ్యవసాయశాఖ, ఆత్మ సంయుక్త ఆధ్వర్యంలో లాం ఫామ్‌లోని ప్రాంతీయ పరిశోధనా స్థానం కృష్ణ ఆడిటోరియంలో మంగళవారం ఉదయం 10 గంటల నుంచి కార్యక్రమం జరుగుతుందని జిల్లా వ్యవసాయ అధికారి ఎం.పద్మావతి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రస్తుత వాతావరణ పరిస్థితులు, రానున్న రోజుల్లో ఎల్‌నినో ప్రభావం పంటలపై చూపే ప్రభావంపై రైతులకు నిపుణులు అవగాహన కల్పిస్తారని పేర్కొన్నారు. వరి, పత్తి, మొక్కజొన్న, పప్పుధాన్యాలు, ఉద్యాన పంటలకు సంబంధించి నీటి యాజమాన్యం, ఎరువుల వినియోగం, చీడపీడల నివారణ, ప్రత్యామ్నాయ పంటల ఎంపికపై శాస్త్రవేత్తలు సూచనలు అందించనున్నట్లు వెల్లడించారు. మేళాలో రైతులు తమ పంటలకు సంబంధించిన సమస్యలు, సందేహాలను నేరుగా వ్యవసాయ శాస్త్రవేత్తలు, అధికారులతో చర్చించి పరిష్కార మార్గాలు తెలుసుకునే అవకాశం ఉంటుందన్నారు. కొత్త రకాల విత్తనాలు, సూక్ష్మ సేద్య పరికరాలు, డ్రిప్, స్ప్రింక్లర్ పరికరాల ప్రదర్శన కూడా ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. వ్యవసాయ విశ్వవిద్యాలయం, కేవీకే శాస్త్రవేత్తలతో పాటు ఆత్మ, వ్యవసాయ, పశుసంవర్ధక, ఉద్యాన, మత్స్య, పట్టుపరిశ్రమల శాఖల అధికారులు పాల్గొని రైతులకు సాంకేతిక మార్గదర్శకాలు అందించనున్నట్లు పేర్కొన్నారు.

మల్లిక స్పయిన్ సర్జన్‌కు అంతర్జాతీయ గుర్తింపు

- రోగితో మాట్లాడుతూనే వెన్నెముక ఎండోస్కోపీ శస్త్రచికిత్స
- అవేక్ స్పైన్ ఎండోస్కోపీకి జాతీయ, అంతర్జాతీయ గుర్తింపు

అవార్డుతో డాక్టర్ జె.నరేష్‌బాబు

గుంటూరు మెడికల్: గుంటూరులోని మల్లిక స్పయిన్ సెంటర్‌కు అంతర్జాతీయ స్థాయిలో మరో ప్రతిష్టాత్మక గుర్తింపు లభించింది. చెన్నైలో జరిగిన మిస్సాబ్‌కాన్ 2026 సదస్సులో పాన్ ఏషియన్ సొసైటీ ఆఫ్ మినిమల్లీ ఇన్‌వేసివ్ స్పయిన్ సర్జరీ, చెన్నై స్పయిన్ సొసైటీ సంయుక్తంగా నిర్వహించిన కార్యక్రమంలో మినిమల్లీ ఇన్‌వేసివ్ స్పయిన్ సొసైటీ ఆఫ్ భారత్(మిస్సాబ్) ఇన్నోవేషన్ అవార్డు 2026ను గుంటూరు మల్లిక స్పయిన్ సెంటర్ చీఫ్ స్పయిన్ సర్జన్ డాక్టర్ జె.నరేష్‌బాబు అందుకున్నారు. గుంటూరు కొత్తపేటలోని మల్లిక స్పయిన్ సెంటర్‌లో ఆదివారం జరిగిన మీడియా సమావేశంలో వివరాలను ఆయన వెల్లడించారు. గుంటూరు మల్లిక స్పైన్ సెంటర్ బృందం మొత్తం పది శాస్త్రీయ పరిశోధనా పత్రాలను సమర్పించింది. వీటిలో నాలుగు పత్రాలు వివిధ అవార్డు విభాగాలకు ఎంపికై అవార్డులు గెలుచుకున్నట్లు తెలిపారు.

పూర్తి మత్తు లేకుండానే వెన్నెముక శస్త్రచికిత్స

వెన్నెముక శస్త్రచికిత్సకు సాధారణంగా అవసరమయ్యే పూర్తి మత్తు (జనరల్ అనస్థీషియా) లేకుండా, సరైన రోగులను ఎంపిక చేసి, తగిన మత్తు విధానాలతో రోగి మెలకువగా ఉండి వైద్యులతో మాట్లాడుతూనే వెన్నెముక ఎండోస్కోపీ శస్త్రచికిత్స నిర్వహించే 'అవేక్ స్పయిన్ ఎండోస్కోపీ' అనే వినూత్న విధానాన్ని అభివృద్ధి చేసి, సురక్షితంగా నిర్వహించడానికి అవసరమైన సాంకేతికతలు, మెళకువలను ప్రతిపాదించినందుకు డాక్టర్ నరేష్‌బాబుకు ఈ అవార్డు లభించింది.

ధ్వని తరంగాలతో వెన్ను ఒత్తిడి తొలగింపు

వెన్నెముక శస్త్రచికిత్సలో సంప్రదాయంగా ఉపయోగించే మోటార్ డ్రిల్స్, బోన్ కట్టర్స్, బర్స్ వంటి పరికరాలకు భిన్నంగా, అల్ట్రాసోనిక్ సౌండ్ వేవ్స్ (అల్ట్రాసోనిక్ ధ్వని తరంగాలు) ఆధారంగా పనిచేసే సాంకేతికతను ఎండోస్కోపిక్ శస్త్రచికిత్సలో ఉపయోగించడం ఈ విధానంలోని ప్రత్యేకత. ధ్వని తరంగాలు వెన్నులోని నరాలకు హాని కలిగించకుండా వెన్ను ఒత్తిడిని నివారించే ప్రత్యేకమైన గుణాన్ని కలిగి ఉంటాయి. ముఖ్యంగా నరాలు, ఇతర సున్నితమైన నిర్మాణాలకు సమీపంగా పనిచేసే సమయంలో ఈ సాంకేతికత ఉపయోగకరంగా ఉంటుంది.

తొలిసారి ఆపరేషన్‌కు అవార్డు

మొదటిసారిగా ఎండోస్కోపిక్ శస్త్రచికిత్సలో అల్ట్రాసోనిక్ టెక్నాలజీని ఉపయోగించి, కేవలం సుమారు 4 మిల్లీ మీటర్ల. చిన్న కోతల ద్వారా మెడ, వీపు, నడుము వెన్నెముకలకు శస్త్రచికిత్స నిర్వహించే 'ఎండోస్కోనిక్ సర్జరీ' విధానాన్ని ప్రతిపాదించి అభివృద్ధి చేసినందుకు ఈ పరిశోధనకు ఇన్నోవేషన్ అవార్డు లభించింది.

పశ్చిమ డెల్టాకు 3,115 క్యూసెక్కులు విడుదల

దుగ్గిరాల: ప్రకాశం బ్యారేజీ నుంచి పశ్చిమ డెల్టాకు 3,115 క్యూసెక్కులు విడుదల చేసినట్లు నీటి పారుదల శాఖ అధికారులు ఆదివారం తెలిపారు. బ్యారేజి వద్ద 11.5 అడుగుల నీటిమట్టం స్థిరంగా ఉంది. దుగ్గిరాల సబ్ డివిజన్‌లోని హైలెవెల్ చానల్‌కు 126 క్యూసెక్కులు, బ్యాంక్ కెనాల్‌కు 759 క్యూసెక్కులు, తూర్పు కాలువకు 273, పశ్చిమ కాలువకు 117, నిజాంపట్నం కాలువకు 176, కొమ్మమూరు కాలువకు 1,310 క్యూసెక్కులు విడుదల చేశారు.

జిల్లాలో 17 మండలాల్లో వర్షం

కొరిటెపాడు(గుంటూరు): గుంటూరు జిల్లాలో శనివారం ఉదయం నుంచి ఆదివారం ఉదయం వరకు 17 మండలాల్లో వర్షం కురిసింది. అత్యధికంగా దుగ్గిరాల మండలంలో 47.6 మిల్లీ మీటర్లు వర్షం కురవగా, అత్యల్పంగా వట్టిచెరుకూరు మండలంలో 2.4 మి.మీ వర్షం కురిసింది. సగటున 15.8 మి.మీ వర్షపాతం నమోదైంది. వివిధ మండలాల్లో నమోదైన వర్షపాతం వివరాలు ఇలా ఉన్నాయి.. కొల్లిపర మండలంలో 37.6 మి.మీ., తెనాలి 36.4, పెదకాకాని 30.2, మేడికొండూరు 25.8, గుంటూరు తూర్పు 24.6, గుంటూరు పశ్చిమ 18.2, చేబ్రోలు 15.8, మంగళగిరి 9.4, ఫిరంగిపురం 9, పెదనందిపాడు 8.4, తుళ్లూరు 6.8, తాడేపల్లి 3.4, తాడికొండ 3.2, కాకుమాను 3.2, పొన్నూరు మండలంలో 2.8 మి.మీ చొప్పున వర్షం పడింది. ఆగస్టు 9వ తేదీ నాటికి జిల్లాలో సాధారణ వర్షపాతం 47.8 మి.మీ కురవాల్సి ఉండగా, ఇప్పటి వరకు 43.3 మి.మీ వర్షపాతం నమోదైంది.

వైద్యులపై దాడులు అరికట్టాలి

గైనకాలజిస్టుల ఆధ్వర్యంలో 'అభయ డే'

ర్యాలీ పాల్గొన్న గైనకాలజిస్టులు

గుంటూరు మెడికల్: ఫాగ్సి, గుంటూరు ఆబ్‌స్ట్రిక్స్ - గైనకాలజికల్ సొసైటీ (జీఓజీఎస్)సంయుక్త ఆధ్వర్యంలో ఆదివారం గుంటూరు నగరంలో ''అభయ డే''గా పాటిస్తూ వైద్యులు, వైద్య సిబ్బందిపై జరుగుతున్న హింసకు వ్యతిరేకంగా ర్యాలీ నిర్వహించారు. గైనకాలజిస్టుల సంఘం అధ్యక్షుడు డాక్టర్ బి.వెంకటేశ్వరరావు, కార్యదర్శి డాక్టర్ శనక్కాయల ఉమాశంకర్, డాక్టర్ రాజకుమారి, డాక్టర్ షమా సుల్తానా, డాక్టర్ అనిత, డాక్టర్ ప్రత్యూష, డాక్టర్ అన్నె, పీడియాట్రీషియన్ డాక్టర్ సాహితి, కేర్ డెంటల్ కాలేజ్ వైద్యులు, గైనకాలజీ వైద్యుల సంఘం సభ్యులు పాల్గొని తమ మద్దతును తెలియజేశారు. అహల్య ట్రస్ట్ నిర్వాహకులు, ప్రముఖ ఐవీఎఫ్ స్పెషలిస్ట్ డాక్టర్ శనక్కాయల రాజకుమారి మాట్లాడుతూ... వైద్య విద్య పూర్తయిన రోజున హిపోక్రటిక్ ప్రమాణం చేసి రోగి ప్రాణాలను కాపాడటమే ధ్యేయంగా ప్రతిజ్ఞ చేసే వైద్యులపై, వైద్య సిబ్బందిపై దాడులు జరగడం అత్యంత విచారకరమని ఆందోళన వ్యక్తం చేశారు. వైద్యులు, నర్సులు, వైద్య సిబ్బందిపై దాడి చేసినా, బెదిరించినా, ఆసుపత్రిని ధ్వంసం చేసినా కఠినమైన, వేగవంతమైన చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ప్రాణాలు కాపాడే చేతులను కాపాడుకుంటూ సురక్షితమైన ఆరోగ్య వ్యవస్థను నిర్మించాలని యూనియన్ నేతలు పిలుపునిచ్చారు.

బ్యాంక్ ఆఫ్ బరోడా
Bank of Baroda
బ్యాంక్ ఆఫ్ బరోడా
జోనల్ ఆఫీస్ స్ట్రెస్డ్ అసెట్స్ రికవరీ బ్రాంచ్
3-5-822/5, మొదటి అంతస్తు, హైదర్‌గూడ మెయిన్ రోడ్, హైదర్‌గూడ, హైదరాబాద్ - 500029. ఇ-మెయిల్ : armhyd@bankofbaroda.co.in

(సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్, 2002లోని రూల్9(1)కు నిబంధన చూడండి)

SARFAESI చట్టం 2002 క్రింద స్థిరాస్తుల అమ్మకానికి అమ్మకం ప్రకటన

సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్ 2002లోని రూల్ 9(1)కు నిబంధనలతో చదువబడు సెక్యూరిటైజేషన్ అండ్ రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అసెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ యాక్ట్, 2002 క్రింద స్థిరాస్తుల అమ్మకం కోసం ఇ-వేలం అమ్మకం ప్రకటన.

సెక్యూర్డ్ క్రెడిటార్లకు తనఖాపెట్టిన/ చార్జ్‌చేయబడిన దిగువ వివరించిన స్థిరాస్తులు బ్యాంక్ ఆఫ్ బరోడా, సెక్యూర్డ్ క్రెడిటార్ యొక్క అధీకృత అధికారుల ద్వారా భౌతిక స్వాధీనంలోకి తీసుకోబడినవని, (I) 1. మెసర్స్ శ్రీ లక్ష్మీ ట్రేడర్స్, ప్రొప్రైటర్ : శ్రీమతి సక్కుర్తి వసుమతి డి.నం. 4-4-92, 2వ లైన్, చంద్రమౌళి నగర్, మహాలక్ష్మీ నిలయం, గుంటూరు - 522007, ఆం.ప్ర. ఇక్కడ కూడా: 2. నమోదిత కార్యాలయ చిరునామా: గోడౌన్ చిరునామా: C/o శ్రీ గిరి కాటన్ ట్రేడర్స్, నం. 1136, శ్రీరామ్ కాటన్ జిన్నింగ్‌మిల్, సూర్యదేవరపేట, ఏటుకూర్, గుంటూరు - 522017, ఆం.ప్ర., 3) శ్రీమతి సక్కుర్తి వసుమతి (ప్రొప్రైటర్),డి.నం. 4-4-92, 2వ లైన్, చంద్రమౌళి నగర్, మహాలక్ష్మీ నిలయం, గుంటూరు-522007, ఆం.ప్ర., గ్యారంటార్లు: 4) శ్రీ సక్కుర్తి వరప్రసాద్, డి.నం. 4-4-92, 2వ లైన్, చంద్రమౌళి నగర్, మహాలక్ష్మీ నిలయం, గుంటూరు-522007, ఆం.ప్ర. 5) మెస్సర్స్ శ్రీ లక్ష్మీశ్రీనివాస కాటన్ ట్రేడర్స్ (తనఖాపెట్టిన వ్యక్తి), ప్రాతినిధ్యంవహించు వారు దాని పార్టనర్స్: శ్రీ సక్కుర్తి వరప్రసాద్, శ్రీమతి సక్కుర్తి వసుమతి, నమోదిత కార్యాలయం : డి.నం. 4/141 నల్లపాడు, గుంటూరు-522005, ఆం.ప్ర., 6) శ్రీ సక్కుర్తి వరప్రసాద్, మెస్సర్స్ శ్రీ లక్ష్మీశ్రీనివాస కాటన్ ట్రేడర్స్ యొక్క మేనేజింగ్ పార్టనర్, నమోదిత కార్యాలయం : డి.నం. 4/141 నల్లపాడు, గుంటూరు-522005, ఆం.ప్ర., 7) శ్రీమతి సక్కుర్తి వసుమతి, మెస్సర్స్ శ్రీ లక్ష్మీశ్రీనివాస కాటన్ ట్